క్లుప్తంగా

ఎన్టీపీసీ ఆర్ఈడీకి సన్మానం



మనోహర్‌ను సన్మానిస్తున్న సీహెచ్ ఉపేందర్

జ్యోతినగర్: ఎన్టీపీసీ సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏ.కే.మనోహర్‌ను ఘనంగా సన్మానించారు. ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని అనంత శక్తి అతిథి గృహంలో మంగళవారం సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోహర్‌ను హెచ్ఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ ఉపేందర్ సన్మానించారు.

ఎల్ఈడీ బల్బులు అందజేత

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామ పంచాయతీకి కమాన్‌పూర్ లయిన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఎల్ఈడీ బల్బులను పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌కు క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి అందజేశారు. రాత్రి సమయంలో ప్రజలు ఇబ్బందులు పడకూడదని గ్రామంలో రహదారుల వెంట విద్యుత్ స్తంభాలకు బల్బులు అందజేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు జూలపల్లి, కమాన్‌పూర్ గ్రామపంచాయతీలకు బల్బులు అందజేసినట్లు తెలిపారు. కోఆర్డినేటర్ అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, సభ్యులు మచ్చగిరి రాము, జబ్బార్‌ఖాన్, బండ సాయి శంకర్, పోలుదాసరి సాయికుమార్, గాదె బాలు, కారోబార్ భీంరాజ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లిరూరల్: యువత సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని షీటీం ఇన్‌చార్జి ఎస్సై లావణ్య సూచించారు. పెద్దపల్లిలోని శ్రేయ వొకేషనల్ కాలేజీలో మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు, మత్తు పదార్థాలు, డ్రగ్స్ క్రయ, విక్రయాలతో కలిగే నష్టాలను వివరించారు. కాలేజీలకు వచ్చి పోయే సమయాల్లో పోకిరీలు వేధిస్తే వెంటనే 63039 23700 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాలకు గురైతే టోల్‌ఫ్రీ నెంబరు 1930కు ఫోన్ చేయాలన్నారు. షీటీం సభ్యులు స్నేహలత మౌనిక, సురేశ్, ప్రిన్సిపాల్ షాబాద్ ఉన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

ఫెర్టిలైజర్‌సిటీ: కార్పొరేషన్ 21వ డివిజన్ ఫెర్టిలైజర్ సిటీ టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం, రాజరాజేశ్వర ఆలయాల్లో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సతీమణి మనాలి ఠాకూర్ ప్రత్యేక పూజలు చేశారు. డివిజన్ అధ్యక్షుడు బూర్ల శ్రీనివాస్, రాజిరెడ్డి, గుండా రాకేశ్ ఉన్నారు.

ఎస్సారెస్పీ కాలువల ద్వారా సాగునీరు సరఫరా చేయాలి

కాల్వశ్రీరాంపూర్: వర్షాలు లేక పొలాలు ఎండిపోతున్నాయని, బావులు అడుగంటుతున్నాయని మాజీ ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కాల్వశ్రీరాంపూర్‌లో మంగళవారం వారు విలేకరు ల సమావేశంలో మాట్లాడారు. శ్రీరాంసాగర్ డి-86, డి-83 కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు స్పందించి శ్రీరాంసాగర్ కాలువల ద్వారా సాగునీరు అందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు బైరం రమేశ్, బండ రవీందర్‌రెడ్డి, దాసరి లావణ్య, నాయకులు దేవయ్య, సారంగపాణి, ఖదీర్, సదానందం, శీను, రవి, మల్లయ్య, సురేశ్ పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపొందించుకోవాలి

పెద్దపల్లిరూరల్: నైపుణ్యం పెంపొందించుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుందని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లక్ష్మీనర్సయ్య అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మంగళవారం ప్రపంచ యువత నైపుణ్యాల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీవితంలో ఏరంగంలో రాణించాలనుకున్నా ఆయా రంగాలకు సంబంధించిన నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ సతీశ్‌కుమార్, పురుషోత్తం, నారాయణ, మారుతి, తిరుపతి, మురళి పాల్గొన్నారు.

కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి

మంథని: ప్రభుత్వ కళాశాలలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాలను మంగళవారం వారు సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ కళాశాలలో అనేక సమస్యలున్నా ప్రజాప్రతినిధులు, ఇంటర్ బోర్డు యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. ప్రహరీ లేకపోవడంతో పందులు, పశువులు సంచరిస్తున్నాయన్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే అఖిల భారతీయ విద్యా పరిషత్ ఆధ్వర్యంలో మహాధర్నా చేస్తామని పేర్కొన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు సబ్బని సంతోష్, ఉపాధ్యక్షుడు బొల్లంపల్లి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి అశోక్, ఎడ్ల సాగర్, కార్యదర్శి పార్వతీ విష్ణు, కొమురయ్య పాల్గొన్నారు.

కూలుతున్న క్వార్టర్స్ పైకప్పు పెచ్చులు

- ఆందోళనలో కార్మికులు
- పట్టించుకోని సింగరేణి అధికారులు



బెడ్‌పై కూలిన పెచ్చులు



ఆందోళన చేస్తున్న కార్మిక కుటుంబాలు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా పోతనకాలనీలోని క్వార్టర్స్ పైకప్పు పెచ్చులు కూలుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని సింగరేణి కార్మిక కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. 65వ బ్లాక్ 908 క్వార్టర్‌లో నివాసం ఉంటూ వకీల్‌పల్లి మైన్‌లో ఓవర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న రాకేశ్ మంగళవారం బెడ్రూంలో నిద్రిస్తున్న సమయంలో హఠాత్తుగా స్లాబ్ పైకప్పు పెచ్చులు కూలి మీద పడడంతో వెంటనే మేల్కొని బయటకు పరుగులు తీశాడు. పెద్ద శబ్దం రావంతో చుట్టుపక్కల వారు వచ్చి గమనించి రాకేశ్‌ను డిస్పెన్సరీకి తరలించి చికిత్స అందించారు. కొన్నినెలల నుంచి మరమ్మతు చేయాలని చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని రాకేశ్ వాపోయాడు. గతంలో కొన్ని క్వార్టర్లలో కూడా పైకప్పులు కూలినట్లు స్థానికులు చెప్తున్నారు. కూలిన సమయంలో ఇంట్లో తన పిల్లలు లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న సీఐటీయూ ఆల్ ఇండియా కోల్ వర్కర్స్ ఫెడరేషన్ సభ్యులు కుంట ప్రవీణ్‌కుమార్ ఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి క్వార్టర్లకు మరమ్మతు చేపట్టాలని కోరారు. కాగా 65వ బ్లాక్ సంబంధించిన సింగరేణి కార్మిక కుటుంబాలు సింగరేణి యజమాన్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు.

తక్షణమే మరమ్మతు చేపట్టాలి



ఆర్జీ–2ఏరియా పోతనకాలనీలోని సింగరేణి క్వార్టర్లను సింగరేణి అధికారులు పరిశీలించి శిథిలావస్థకు చేరుకున్న క్వార్టర్లతో పాటు అవసరమైన క్వార్టర్ల స్లాబ్ పైకప్పులు పరిశీలించి తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలి.

– కుంట ప్రవీణ్‌కుమార్, ఆర్జీ–2, సీఐటీయూ నాయకుడు



కోల్‌సిటీ: గోదావరిఖని తిరుమల్‌నగర్‌లోని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డం వెంకటేశ్వర్లు ఇంటి ముందు నరికిన చెట్లకొమ్మలు నిర్లక్ష్యంగా పడేశారు. 15రోజులు దాటినా తొలగించడం లేదు. దీంతో దోమలకు నిలయంగా మారింది. నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బల్దియా అధికారులు స్పందించి స్థానికులకు ఇబ్బందిగా మారిన చెట్లకొమ్మలను తొలగించాలని కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

తడి, పొడి చెత్తపై వినూత్న ప్రచారం



ప్రచారం చేయిస్తున్న డిప్యూటీ కమిషనర్

కోల్‌సిటీ: నగరపాలక సంస్థలోని రమేశ్‌నగర్‌లో మంగళవారం తడి, పొడి చెత్తపై అధికారులు వినూత్నంగా ప్రచారం చేశారు. 100రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కార్యక్రమాలను డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్టీఆర్ నగర్‌లో డ్రైనేజీలో పూడిక తొలగింపు కార్యక్రమాన్ని పరిశీలించారు. లక్ష్మీనగర్‌లోని వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి పథకం గురించి వివరించారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని ప్రజా మరుగుదొడ్డిని పరిశీలించి ఆవరణ శుభ్రం చేయించారు. నగరపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కుమారస్వామి, నాగభూషణం, కిరణ్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్, వార్డు అధికారులు, మెప్మా టీఎంసీ మౌనిక, సీవోలు ఊర్మిళ, శ్వేత, శమంతకమణి, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

బీసీల మహాధర్నాకు తరలిన నాయకులు



ధర్నాలో బీఆర్ఎస్ మండల నాయకులు

పాలకుర్తి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన బీసీల మహాధర్నా కార్యక్రమానికి మండల పరిధిలోని బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో నాయకులు హైదరాబాద్‌కు వెళ్లి ధర్నాలో పాల్గొన్నారు. పార్టీ మండల అధికార ప్రతినిధి ముల్కల కొమురయ్య, నాయకులు బండి శ్రీనివాస్‌గౌడ్, కుడుక రాజయ్య, బైరి రామకృష్ణ ఉన్నారు.

పొత్కపల్లి హైస్కూల్లో మాక్ పోలింగ్



మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఓదెల: మండలంలోని పొత్కపల్లి హైస్కూల్‌లో మంగళవారం మాక్ పోలింగు నిర్వహించారు. విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. పాఠశాల హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్ హౌస్ కెప్టెన్లకు బ్యాలెట్ పద్ధతిలో రహస్య ఎన్నిక నిర్వహించారు. రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నిక నిర్వహించారు. రెడ్ హౌస్ గర్ల్ కెప్టెన్‌గా శ్రీనిత్య, బాయ్స్ కెప్టెన్‌గా సాయిప్రసాద్ ఎన్నికయ్యారు. ప్రధానోపాధ్యాయులు బి.సాంబయ్య, ఉపాధ్యాయులు భద్రయ్య, అమృతకిషోర్, రవి, తోట రవీందర్, పద్మావతి, శ్రీనివాస్, హరికృష్ణ, సంజీవ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



అభినందిస్తున్న కమిషనర్ రమేశ్

సుల్తానాబాద్: పట్టణంలోని శ్రీచైతన్య విద్యార్థులు అంతర్జాతీయ పోటీల్లో 30మంది ఎంపిక కావడం హర్షణీయమని మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేశ్ కొనియాడారు. జాతీయస్థాయిలో ప్రత్యేక బహుమతి పొందిన విద్యార్థులు విందు, మహాలక్ష్మి, హర్షిని, నాగచైతన్య, వర్షిత్, నిహాల్ సాత్విక్‌కు మంగళవారం నాసా సర్టిఫికెట్ మెమెంటో అందించి ఆయన అభినందించారు.

వ్యవసాయ భూముల మధ్యలో రోడ్డు నిర్మాణం

సాక్షి ఎఫెక్ట్..

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎగ్లాస్‌పూర్ గ్రామ శివారులోని సర్వే నెంబర్లు 116, 117లో రైతులు వ్యవసాయ భూములకు వెళ్లేదుకు ఉపాధి హామీ నిధులతో నాలుగేళ్ల క్రితం మట్టి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇటీవల ఇరువైపులా రైతులు రోడ్డును కబ్జా చేస్తుండడంతో చివరి భూముల రైతులు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై గత నెల 26న 'యథేచ్ఛగా భూకబ్జా' అనే శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష క్షేత్ర పరిశీలన చేసి నివేదిక సమర్పించాలని అంతర్గాం తహసీల్దార్ రవీందర్‌పటేల్‌ను ఆదేశించారు. క్షేత్ర పరిశీలన చేసిన తహసీల్దార్ రోడ్డును కబ్జా చేసినట్లు గుర్తించి నివేదిక సమర్పించారు. దీంతో ఉపాధిహామీ నిధులతో మంగళవారం పంటపొలాల మధ్య నుంచి తహసీల్దార్ సమక్షంలో రోడ్డు నిర్మాణం చేపట్టారు. కాగా పలువురు రైతులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

• చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముత్తారం: మండలంలోని మైదంబండకు చెందిన బియ్యాని రవీందర్ (45) కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మృతుడి కుమారుడు అజయ్ చదువు మానేసి కూలి పనికి వెళ్లడానికి నిరాకరించడంతో రోజూ ఇరువురి మధ్య గొడవలు జరిగేవి. ఈనెల 14న కూలి పనికి వెళ్లొద్దని, గ్రామంలో తిరగొద్దని చదువుకోవాలని కుమారుడికి చెప్పగా ఇరువురికి గొడవ జరిగింది. ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన రవీందర్ సోమవారం రాత్రి ఇంటికి వచ్చాడు. పురుగుల మందు తాగిన వాసన రావడంతో భార్య సునీత ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పింది. మొదట పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ మధునయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

• జీడీకే–11వ గనిలో అస్వస్థతకు గురైన కార్మికుడు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని జీడీకే–11గనిలో మద్రి మహేందర్ అనే జనరల్ అసిస్టెంట్ కార్మికుడు మంగళవారం అస్వస్థతకు గురయ్యాడు. గనిలోని కంటిన్యూస్ మైనర్–2లో వెంటిలేషన్ సరిగా లేక అక్కడ పనిచేస్తున్న మహేందర్‌కు చాతిలో నొప్పితో కుప్పకూలిపోయాడు. హుటాహుటిన ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా ఇదే గనిలో కంటిన్యూస్ మైనర్–2లో రెండు రోజుల క్రితం మరో కార్మికుడు కూడా ఇలాగే అస్వస్థతకు గురయ్యాడు.

• ఒర్రె ఆక్రమణపై ఫిర్యాదు

పెద్దపల్లిరూరల్: పట్టణ శివారు రంగంపల్లిలో ఒర్రెను ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవసాయ భూమిని ప్లాట్లుగా మార్చిన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలంటూ మున్సిపల్ అధికారులకు మాజీ వార్డు సభ్యుడు ఉప్పు రమేశ్, శ్రీకాంత్ మంగళవారం ఫిర్యాదు చేశారు. పెద్దకల్వల చెరువు నుంచి రంగంపల్లిలోని పంట పొలాలకు నీరందించే ఒర్రెను వెంచర్ నిర్వాహకులు కబ్జా చేశారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా వెలసిన వెంచర్‌లో ఒర్రెపై చేస్తున్న నిర్మాణాలను తొలగించి ఆక్రమణలు దూరం చేయాలన్నారు. ఈ వ్యవహారంపై కలెక్టర్, ఇతర శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

• నూతన సభ్యత్వాలు ఆమోదించాలి

మంథని: మంథని కే–8 సొసైటీలో రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నూతన సభ్యత్వాలను త్వరగా ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ కమిషనర్ నిఖిలకు మంథని మత్స్యశాఖ అధ్యక్షుడు, జిల్లా డైరెక్టర్ పోతరవేని క్రాంతికుమార్ విన్నవించారు. హైదరాబాద్‌లోని ఫిషరీష్ కార్యాలయంలో మంగళవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలు వివరించారు.

• విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు పాఠశాలకు వచ్చి వెళ్లేందుకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు కోరారు. పెద్దపల్లిలో మంగళవారం కలెక్టర్ శ్రీహర్షను కలిసి వినతిపత్రం అందించారు.

• మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు

జూలపల్లి: పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క పెద్దపల్లి పర్యటనలో మాజీ సర్పంచులు అడ్డుకునే యత్నం చేస్తారన్న సమాచారంతో ముందస్తుగా అరెస్టు చేసి స్థానిక ఠాణాలో ఉంచారు. అనంతరం సొంత పూచీ కత్తుపై వారిని విడుదల చేశారు.

• కుమ్మరికుంటలో బీఆర్ఎస్ సమావేశం

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంటలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ పాల్గొన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతీ కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నాయకులు విసారపు వెంకటేశం, మల్లేశం, రాజేశ్వర్‌రెడ్డి, సంతోష్‌రావు, మధు, శంకరయ్య పాల్గొన్నారు.

• రైలునుంచి జారిపడి యువకుడికి గాయాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం రాత్రి న్యూఢిల్లీ నుంచి చెన్నై సెంట్రల్ వెళ్తున్న తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ఉత్తరప్రదేశ్‌కు చెందిన జితేంద్ర జారిపడగా గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు గాయపడ్డ యువకుడిని పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కర్ణాటకలోని బెంగుళూరులో కూలీపనుల కోసం వెళ్తుండగా రైలు నుంచి జారిపడ్డాడని రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

• బాలకార్మికుడి గుర్తింపు.. కేసు నమోదు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్ ఇటుకబట్టీలో మైనర్ బాలుడితో పనులు చేయిస్తున్నారంటూ సహాయ కార్మిక శాఖ అధికారి హేమలత ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై మల్లేశ్ తెలిపారు.

• గీత కార్మికులకు రక్షణ కవచాల కిట్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ గ్రామ గీత కార్మికులకు మంగళవారం అబ్కారీశాఖ ఆధ్వర్యంలో కాటమయ్య రక్షణ కవచాల కిట్‌ను అందజేశారు. అబ్కారీ ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ రక్షణ కవచాలు వినియోగిస్తే గీత కార్మికులు ప్రమాదాలకు గురికాకుండా కాపాడుకోవచ్చన్నారు.

నర్సరీ పరిశీలన

సుల్తానాబాద్: పట్టణంలోని నర్సరీని మంగళవారం మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేశ్ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 100రోజుల ప్రణాళికలో భాగంగా పరిసరాల పరిశుభ్రతే ధ్యేయంగా ప్రతీ కాలనీ పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రజలు సహకరించాలన్నారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని నర్సరీని, మెయిన్ రోడ్, శ్రీరాంపూర్ రోడ్లను పరిశీలించారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. మేనేజర్ అలిమొద్దీన్, రాజ్‌కుమార్, నాగరాజు, మెప్మా ఇన్‌చార్జి స్వరూప, వార్డు ఆఫీసర్ శ్రీనివాస్, శ్రవణ్‌కుమార్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

చోరీ కేసులో దొంగ అరెస్ట్

మంథని: మంథని ఆర్టీసీ బస్టాండ్‌లో మండలంలోని మల్లెపల్లికి చెందిన విజ్జగిరి బానయ్య బస్సు ఎక్కుతుండగా అతని జేబులోంచి రూ.50వేల నగదు చోరీ చేసిన శ్రీపాదకాలనీకి చెందిన కోట రాజయ్యను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ డేగ రమేశ్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం దొంగ అరెస్ట్ వివరాలను వెల్లడించారు. 14న బానయ్య కేడీసీసీ బ్యాంకు నుంచి రూ.50వేలు తీసుకుని బస్టాండ్‌లో కరీంనగర్ బస్ ఎక్కుతుండగా డబ్బులు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణలో మంథని మున్సిపల్ పరిధిలోని శ్రీపాదకాలనీలో నివాసం ఉంటున్న కోట రాజయ్యను అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి రూ.29,500 స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. 24 గంటల్లో చోరీ కేసును ఛేదించి నిందితుడిని పట్టుకున్న హెడ్‌కానిస్టేబుల్ రమేశ్, కానిస్టేబుల్ శివకుమార్, ఆదేశ్‌లను సీఐ రాజు, ఎస్ఐ రమేశ్ అభినందించారు.

మహిళలను స్వశక్తి సంఘాల్లో చేర్పించండి



సమావేశంలో స్వశక్తి సంఘాల మహిళలు

జ్యోతినగర్: పేద మహిళలకు కొత్త స్వశక్తి సంఘాలను ఏర్పాటు చేసి సభ్యులుగా చేర్పించాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి ఆదేశించారు. వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించారు. ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లోని మహిళా స్వశక్తి భవన్‌లో నిర్వహించిన స్టేక్ హోల్డర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘాల్లో చేరిన మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలు వివరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కుమారస్వామి, నాగభూషణం, కిరణ్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్, వార్డు అధికారులు, మెప్మా టీఎంసీ మౌనిక, సీవోలు ఊర్మిళ, శ్వేత, శమంతకమణి, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

కార్మికుల మారుపేర్ల సమస్య పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: సింగరేణి కార్మికుల మారుపేర్ల సమస్య పరిష్కరించాలని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కోరారు. సింగరేణి డైరెక్టర్(పా) గౌతం పొట్రూను మంగళవారం కొత్తగూడెంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మెడికల్ బోర్డులను రెగ్యులర్‌గా నిర్వహించాలన్నారు. నైనీ బ్లాక్ కోసం ప్రత్యేక రిక్రూట్‌మెంట్ చేపట్టాలన్నారు. ఏరియా ఆసుపత్రుల్లో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. సర్వే ఆఫీసర్ల భర్తీ చేయాలన్నారు. దీనిపై డైరెక్టర్(పా) సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. నాయకులు నరసింహారెడ్డి, ధర్మపురి, త్యాగరాజన్, జెట్టి శంకర్‌రావు, వికాస్‌కుమార్‌యాదవ్ ఉన్నారు.

జీడీకే–5 ఓసీపీలో బీసీ నాయకుల సంబరాలు

గోదావరిఖని: బీసీలకు 42శాతం రిజర్వేషన్స్‌పై ప్రభుత్వం ఆర్డినెన్స్ ఇవ్వడాన్ని హర్షిస్తూ మంగళవారం ఆర్జీ–1లో ఓసీపీ–5లో స్వీట్లు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. బీసీ నాయకులు దీటి చంద్రమౌళి, పి.శ్రీనివాస్, పెంచాల తిరుపతి, కాట్రోచ్ మోహన్, గంధం రాములు, మండ రమేశ్, ప్రభుదాస్, చందా తిరుపతి, జనగాం శ్రీనివాస్, చిందం శ్రీనివాస్, కృష్ణ, శంకర్ పాల్గొన్నారు.

జీడీకే–5 ఓసీపీ పిట్ సెక్రటరీగా శ్రీనివాస్



గోదావరిఖని: బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జీడీకే–5 ఓసీపీ పిట్ సెక్రటరీగా జనగామ శ్రీనివాస్‌గౌడ్‌ను నియమించారు. నియామక పత్రాన్ని అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ దీటి చంద్రమౌళి మంగళవారం అందజేశారు.

ఘనంగా సంకష్టహర చతుర్థి



యైటింక్లయిన్‌కాలనీ: సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో గణపతికి సోమవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కేంద్ర బృందం పర్యటన విజయవంతం చేయాలి

మంథనిరూరల్: ఎస్ఎస్‌జీ 2025లో భాగంగా 19న గుంజపడుగులో జరిగే కేంద్ర బృందం పర్యటనను విజయవంతం చేయాలని డీఎల్‌పీవో కొమ్మెర సతీశ్‌కుమార్ ఆదేశించారు. మంథని మండలం గుంజపడుగులో మంగళవారం ఆయన పర్యటించారు. కేంద్ర బృందం పర్యటన నేపథ్యంలో ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేశారు. కార్యదర్శి భానుప్రసాద్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

డ్రైనేజీ పనులు నిలిపివేయాలి



పనులు పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

రామగిరి: మండలంలోని రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణ నుంచి సింగరేణి సంస్థ ఏర్పాటు చేస్తున్న డ్రైనేజీ పనులు నిలిపివేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కొండు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. వర్షాకాలంలో పాఠశాలలో వరదనీరు చేరే అవకాశం ఉందని, పంట పొలాలకు సాగునీరందించే కాలువలో డ్రైయినేజీ ఏర్పాటు చేయడం సింగరేణి సంస్థ మానుకోవాలన్నారు. తక్షణమే డ్రైనేజీ నిర్మాణ పనులు నిలిపివేయకుంటే సింగరేణి జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామన్నారు.

సంబరాల సభ విజయవంతం చేయాలి

సుల్తానాబాద్: జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించే ప్రగతి ఇందిరా మహిళా శక్తి సంబరాల సభ విజయవంతం చేయాలని సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలుక సతీశ్ కోరారు. మంత్రుల బహిరంగ సభకు మండలం నుంచి 5వేల మందిని తరలిస్తున్నట్లు వారు తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్‌కు ఏఎస్సైగా పదోన్నతి

ఎలిగేడు: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న శ్రవణ్ కుమార్‌కు ఏఎస్సైగా పదోన్నతి లభించింది. మంగళవారం రాత్రి శ్రవణ్ కుమార్‌కు రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా స్టార్ బ్యాడ్జి పెట్టారు.

బీసీ రిజర్వేషన్ల ప్రకటనపై హర్షం

రామగుండం: రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ల విషయమై కేబినెట్‌లో తీరానం చేసి ఆర్డినెన్స్ జారీ చేయడంపై కాంగ్రెస్ శ్రేణుల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇందులో భాగంగా కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ మంగళవారం హైదరాబాద్ సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబును ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

మహిళాశక్తి సంబరాలకు తరలిరండి

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రమైన పెద్దపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో బుధవారం నిర్వహించనున్న మహిళాశక్తి సంబరాల్లో పాల్గొని సభ విజయవంతం చేయాలని డీఆర్‌డీవో కాళిందిని కోరారు.